RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in   rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 318 | 09 శుక్రవారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావవలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## బిల్డ్ ఏపీ మా ప్రభుత్వ నినాదం

**ఎంవోయూలను పెట్టుబడులుగా మలిచేలా కార్యాచరణ**

**త్వరలోనే పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతాలి**

**ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని మరువలేం**

**సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**భారత అభివృద్ధి ప్రయాణంలో ఏపీది కీలక పాత్ర అన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**



**ఢిల్లీ, రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్య స్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు. గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు తెలిపారు. గడచిన 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చెప్పారు. కేవలం ఎంవోయూలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ పెట్టుబడులుగా మలిచేలా ప్రత్యేకంగా దృష్టి సారించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. - మిగతా 2లో..

## ఉప్పు భూముల బదలాయింపు కోరిన చంద్రబాబు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి భేటీ
- పోర్టుల ఆధారిత అభివృద్ధిపై విస్తృత చర్చ
- వాణిజ్య పంటల ఎగుమతులకు సహకారం కోరిన రాష్ట్రం



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో పోర్టుల ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సుమారు 20,378 ఎకరాల ఉప్పు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి విస్తారమైన తీరప్రాంతం, అనేక ఓడరేవులు ఉండటంతో పోర్టుల ఆధారిత పరిశ్రమలకు అపార అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. తీర ప్రాంతాల్లో పారిశ్రామిక మండలాలు, గిడ్డంగులు, ఎగుమతి కేంద్రాలు, విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆధీనంలోని ఉప్పు భూములను రాష్ట్రానికి బదలాయిస్తే అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయగలమని పేర్కొన్నారు.వాణిజ్య పంటల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే కీలక స్థానంలో ఉందని చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా మిర్చి, పొగాకు, జలకృషి ఉత్పత్తులు వంటి రంగాల్లో రాష్ట్ర రైతులు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ మరింత విస్తరణకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర రైతులకు మెరుగైన ధరలు లభించేలా అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతుల పెంపు కోసం అవసరమైన మార్కెట్ అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, ప్రాసెసింగ్ కేంద్రాలు, నిల్వ సదుపాయాలు, రవాణా వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడం అత్యంత అవసరమని తెలిపారు.రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, ఎగుమతి ప్రోత్సాహక మండలాల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని చంద్రబాబు కోరారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను సిద్ధం చేసేందుకు అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంపుతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పోర్టుల అభివృద్ధి, పారిశ్రామికీకరణ, వ్యవసాయ ఎగుమతుల విస్తరణ వంటి అంశాలు రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉప్పు భూముల బదలాయింపు, వాణిజ్య పంటల ఎగుమతుల ప్రోత్సాహానికి అవసరమైన చర్యలు తీసుకుంటే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ఇతర అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

## దసరా పండుగకు 5,261 ప్రత్యేక బస్సులు: ఏపీఎస్ ఆర్టీసీ

**అమరావతి, రాజధాని వాయిస్ :** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దసరా పండుగకు ప్రత్యేక బస్సులు నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ నెల 16 నుంచి 25 వరకు 5,261 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి పొరుగు ప్రాంతాల నుంచి ఏపీలోని వివిధ జిల్లాలకు, ముఖ్యమైన నగరాల మధ్య ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్‌కు 1,186, విశాఖకు 440, బెంగళూరుకు 475, చెన్నైకి 153, తిరుపతికి 247, రాజమహేంద్రవరానికి 347 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది. ప్రయాణికులు ఏపీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఈ ప్రత్యేక బస్సుల టికెట్లను ముందుగానే రిజర్వ్ చేసుకోవచ్చు.

## నేతలంతా పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి

**చంద్రబాబు గారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి నాయకుడు పనిచేయాలి**

**టిడిపి ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్స్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మీట్ అండ్ గ్రీట్**



**అమరావతి, రాజధాని వాయిస్ :** ఎంత సీనియర్ నేతలైనా టిడిపి లైన్‌కు కట్టుబడి పని చేయాల్సిందేనని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శిక్షణాతరగతుల ట్రైనర్లతో లోకేష్ మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,300మంది క్లస్టర్, బూత్ ఇన్చార్జిలకు శిక్షణా తరగతులు పూర్తి చేశామని, 50వేలమందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులకు శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు అన్న పార్టీ మూల సిద్ధాంతానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 45రోజుల్లో 1.13 కోట్ల ఇళ్లను నాయకులు సందర్శించారని చెప్పారు. పార్టీకంటే ఎవరూ గొప్పవారు కాదని, ఏదైనా అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

పార్టీలో కేవలం పెర్ఫార్మెన్స్ ఆధారంగానే నాయకులకు గుర్తింపునిస్తామని, ఈ విషయంలో ఎటువంటి సిఫారసులు, పైరవీలకు తావీయబోమని స్పష్టంచేశారు. పార్టీ కార్యక్రమాలను మరింత వేగంగా, సులభంగా గ్రాస్ రూట్ స్థాయి కేడర్ కు తీసుకెళ్లేందుకు ఏఐని వినియోగిస్తున్నామని, అధునాతన టెక్నాలజీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శిక్షణా తరగతులకు వచ్చే నాయకులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం, అందరూ ఆర్థికంగా బలోపేతమై సొంతకాళ్లపై నిలబడేలా చేయాలన్నది పార్టీ అధినేత అంతరంగమని తెలిపారు. కేంద్రంలో బిజెపి వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడానికి ఆ పార్టీ కేడర్ కమిట్‌మెంట్ ప్రధాన కారణమని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో కూడా ప్రభుత్వ కొనసాగింపు కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అందరికీ ఒకేసారి న్యాయం చేయడం సాధ్యం కాదని, వివిధ కారణాల వల్ల తొలిదశలో అవకాశాలు రానివారికి మలివిడతలో అవకాశం కల్పిస్తామని లోకేష్ చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న పలువురు సీనియర్ నాయకుల అనుభవాలను లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మానవ వనరుల విభాగం కోఆర్డినేటర్ వేపాడ చిరంజీవి, ఎంపి చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు. సమర్థవంతంగా శిక్షణాతరగతులు నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకులకు మంత్రి లోకేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

## గోదావరి--కావేరి అనుసంధానంతో దక్షిణాదికి మేలు



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** గోదావరి--కావేరి నదుల అనుసంధానాన్ని చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు అపార ప్రయోజనం కలుగుతుందని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్రం చొరవ, రాష్ట్రాల మధ్య సమన్వయంతో నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్లడంతో దక్షిణాదిలో నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపొచ్చని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో గురువారం జరిగిన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను సిఎం ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు తాజా పరిస్థితి, గోదావరి--కావేరి అనుసంధానం, వ్యవసాయం, సాగునీరు, మౌలిక సదుపాయాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రధానితో చర్చించారు. దేశంలో రహదారుల నెట్‌వర్క్, విద్యుత్ గ్రిడ్ ఏర్పాటు చేసిన తరహాలో నదుల అనుసంధానంతో 'వాటర్ గ్రిడ్' ఏర్పాటుకు మార్గం సుగమం చేయవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. గోదావరి--కావేరి అనుసంధానం జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నీటి లభ్యత పెరుగుతుందని వివరించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు మిగులు జలాలను తరలించడం ద్వారా వ్యవసాయ రంగంతోపాటు పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని ప్రధానికి చంద్రబాబు వివరించారు. పుష్కరాల సందర్భంగా చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇతర పనులకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

**53 శాతం లోటు వర్షపాతం** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని ప్రధాన మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. లోటు వర్షపాతం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానితో పంచుకున్నారు.

**విశాఖ మెట్రోకు వినతి**

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందించాలని సిఎం కోరారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు తదితర ప్రాజెక్టులపై చర్చించారు. విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రధానిని కోరారు. విశాఖ బీచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అంశాలను కూడా వివరించారు.

## ఢిల్లీ నుంచి గల్లీ వరకూ మార్మోగిన నినాదం



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** 'ఓటు చోర్.. గడ్డీ చోడ్ (ఓటు దొంగ.. పదవి నుంచి దిగిపో)' నినాదాలు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించాయి. 'జ్ఞానూ.. ఇట్స్ డన్ బ్రో' అంటూ యువత నినాదాల హోరు బెంగళూరు, ఢిల్లీ, బీహార్, హైదరాబాద్, భువనేశ్వర్, త్రిపుర సహా పలు ప్రాంతాల్లో మార్మోగింది. వరుసగా మూడోరోజూ దాదాపు 300 మంది ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన కొనసాగించారు. కాంగ్రెస్, సిపిఎం, వామపక్ష?లుసహా ఇండియా వేదికలోని పార్టీలతోపాటు బిజెడి సహా పలు పార్టీలకు చెందిన ఎంపిలు, నేతలు భాగస్వాములయ్యారు. గాంధీ సమాధి రాజ్‌ఘాట్‌కు చేరుకున్న నిరసనకారులు శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. 'ఈ ప్రభుత్వానికి, జ్ఞానేష్‌కుమార్‌కు విజ్ఞతనివ్వండి మహాత్మా' అంటూ గాంధీకి మొరపెట్టుకున్నారు. బెంగళూరు ఫ్రీడమ్ పార్కులో భారీ సభకు అబిజిత్‌దీప్కే సహా సిజెపి అగ్రనేతలు, యూట్యూబర్ ధ్రువ్‌రాఠీ, సినీ నటుడు ప్రకాష్‌రాజ్, కన్నడ రచయిత దేవనూర్ మహాదేవ, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల్‌గౌడ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మతోన్మాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన గౌరీ లంకేష్ సోదరి, చిత్ర నిర్మాత కవిత లంకేష్ సభలో మాట్లాడుతూ తన దత్తపుత్రుడిగా అభిజిత్ దీప్కేను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ నిరసనల్లో దాడికి గురైన మహిళలకు సంఘీభావంగా ఇదే సభలో 'చెప్పులతో' యువతులు నిరసన తెలిపారు. అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పాలని, మహిళలపై హింసను అంతం చేయాలని నినదించారు. లంకేష్, ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో ఉన్నవారంతా ఈ ర్యాలీలో భాగస్వాములవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బీహార్‌లో చలో లోక్‌భవన్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ప్రతిపక్ష? నేత తేజస్వియాదవ్ బారికేడ్లను దాటి వెళ్లారు. దీంతో, గవర్నర్ వద్దకు ఆయనసహా ప్రతినిధి బృందాన్ని అనుమతించారు. అదే సమయంలో ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్ష?డు ఆ ప్రాంగణానికి చేరుకోవడంతో ఆయనకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. హైదరాబాద్‌లో చలో లోక్‌భవన్‌కు ర్యాలీగా వెళ్లిన వారిని అడ్డుకోవడంతోపాటు మంత్రులుసహా పలువురిని అరెస్టు చేశారు. భువనేశ్వర్‌లోనూ చలో లోక్ భవన్ నిర్వహించి నిరసన తెలిపారు.

## విజయవాడ ఉత్సవ్.. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను తెదేపా ఎంపీలు విజయవాడ ఉత్సవ్-2.0 కి రావాలని ఆహ్వానించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ స్థాయిలో పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని).. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్ రావు, భరత్‌లు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్ బాబు.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఆహ్వాన పత్రికలు అందజేసి విజయవాడ ఉత్సవ్‌కు రావాలని కోరారు. బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లను కలిసి ఆహ్వానించారు.



# సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని చేరవేయాలి



**పర్చూరు, రాజధాని వాయిస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పర్చూరు నియోజకవర్గంలో సామాజిక మాధ్యమాల ప్రభావశీలులతో నిర్వహించిన సమావేశం లో ఆమె పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ చర్యలు, వివిధ వర్గాల కోసం అమలు చేస్తున్న పథకాల వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలిసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు సరైన సమాచారం చేరినప్పుడే ప్రభుత్వ కార్యక్రమాల అసలు ప్రయోజనం అందుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించడం అవసరమని చెప్పారు. ప్రస్తుత కాలంలో ప్రజలు ఎక్కువగా సామాజిక మాధ్యమాల ద్వారానే సమాచారాన్ని పొందుతున్నారని హోంమంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో సమాజంపై ప్రభావం చూపగల సామాజిక మాధ్యమాల ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే సమాచారం, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో తప్పుడు ప్రచారాలు, అపోహలు వ్యాపించకుండా వాస్తవాలను తెలియజేయడంలో ప్రభావశీలుల పాత్ర ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు సరైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వంపై విశ్వాసం పెరగడంతో పాటు పథకాల అమలులో కూడా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సమాచారాన్ని అందించడంపై దృష్టి సారించాలని సూచించారు.సామాజిక మాధ్యమాలు కేవలం వినోద వేదికలుగా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించే శక్తివంతమైన సాధనాలుగా మారాయని హోంమంత్రి అన్నారు. విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పులను కూడా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న సామాజిక మాధ్యమాల ప్రతినిధులు ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని మరింత విస్తృతంగా చేరవేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. ప్రజలకు వాస్తవ సమాచారం చేరేలా సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది.

# కరువు మండలాలుగా ప్రకటించాలని రైతుల మహాధర్నా

- ఎమ్మిగనూరులో రైతులతో కలిసి నిరసనలో పాల్గొన్న రాజీవ్ రెడ్డి
- పంట బీమా, నష్టపరిహారం అందించాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక




**ఎమ్మిగనూరు, రాజధాని వాయిస్ :** కరువు పరిస్థితులతో తీవ్రం గా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాలను వెంటనే తీవ్ర కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులో భారీ మహాధర్నా నిర్వహించారు. పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి నివాసం నుంచి ప్రారంభమైన భారీ ద్విచక్ర వాహన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా శివ సర్కిల్‌కు చేరుకుంది. అనంతరం రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో ప్రాంతమంతా నినాదాలతో మారుమోగింది. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు మూడు మండలాల్లో వర్షాభావం కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయా యని తెలిపారు. వర్షాలపై ఆశలు పెట్టుకుని రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేసినప్పటికీ తరువాత వర్షాలు లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పెట్టుబడులు తిరిగి రాక రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని, కొందరు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక వర్షపాతం గణాంకాలు కూడా సాధారణం కంటే గణనీయమైన లోటును చూపుతున్నాయని పేర్కొంటూ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సభ్యుడు బనవాసి బసిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం కొన్ని ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు రూరల్ మండలాలు జాబితాలో లేకపోవడం బాధాకరమన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నప్పటికీ రైతుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి చేరడం లేదని ఆరోపించారు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎర్రకోట రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ పంట బీమా కోసం రైతులు భారీ మొత్తంలో ప్రీమియం చెల్లించారని, ఇప్పుడు పంటలు నష్టపోయిన సమయంలో వారికి బీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు బీమా చేయించమని చెప్పిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు రైతుల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రైతులు నష్టపోయినప్పుడు వారికి అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం వద్ద న్యాయం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు అండగా నిలిచిందని రాజీవ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు మండలాలను తీవ్ర కరువు మండలాలుగా ప్రకటించి పంట బీమా, నష్టపరిహారం, ఇతర సహాయక చర్యలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# బిల్డ్ ఏపీ మా ప్రభుత్వ నినాదం

గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీకి వస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రకటించినట్టుగా పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా ఈ ఏడాది నవంబరు 12, 13 తేదీల్లో ప్రారం భించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణమే అమలు చేయడానికి ఏపీ సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**నీటి వనరులు... గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి**

గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరత ఉండదని చంద్రబాబు అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే తమ లక్ష్యమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాక్‌యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందని, మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు గోవా షిప్‌యార్డ్ సంస్థ అంగీకరించిందని వెల్లడించారు. తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాయలసీమలో ఐదో తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును రక్షణ శాఖ ప్రారంభించిందని తెలిపారు. డేటా లేక్ వంటి వ్యవస్థల ద్వారా ఏఐ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ ఆధారిత సాంకేతికతను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ఏఐతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో రాణించేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను ప్రత్యేక బ్రాండ్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లకు ప్రమోట్ చేస్తామని వెల్లడించారు. బ్లూ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయని చెప్పారు. అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ద్వారా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందన్నారు. బాపట్లలోని సూర్యలంక వంటి అద్భుతమైన తీర ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

**అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని**

దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. దేశంలో డిజిటల్ మౌలిక వసతులను తీసుకురావడంలో ప్రధాని కీలక పాత్ర పోషించారని చెప్పారు. అత్యద్భుతమైన రహదారి నెట్‌వర్క్‌తో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని, రైల్వే నెట్‌వర్క్‌లోనూ కీలక స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్లతో బలమైన మౌలిక వసతులను దేశంలో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రక్షణ రంగంలోనూ అత్యంత భద్రమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ప్రధాని పాత్ర విశేషమని సీఎం పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయులు ముందున్నారని, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ కంపెనీలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించడంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారని అన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తోందని చెప్పారు. విశాఖ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి వివరించారు.

**చరిత్రలో...వర్తమానంలో ఆంధ్రులది ప్రత్యేక స్థానం-పీయూష్**

భారత్ అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర అత్యంత కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మాట్లాడుతూ అమరావతిని పాలించిన శాతవాహనులు వినియోగించిన నాణేల్లో నౌకా




చిహ్నం ఉండేదని గుర్తుచేశారు. అప్పట్లోనే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యం ద్వారా ప్రపంచంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించిందని తెలిపారు. ఆ నౌక చిహ్నం భారతీయుల వాణిజ్యం, విశ్వాసం, ఆలోచనలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ అంటే వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలకు చిరునామాగా ఉందని గోయెల్ అన్నారు. విజనరీ నేత చంద్రబాబు 1998లోనే టెక్నాలజీని అందిపుచ్చుకుని రాష్ట్రంలో విస్తృత అవకాశాలు సృష్టించారని ప్రశంసించారు. సన్‌రైజ్ స్టేట్‌గా ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నాయని చెప్పారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు అవుతోందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాగా దేశ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష అనే విధానంతో ముందుకు సాగుతోందని గోయెల్ చెప్పారు. టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్, టాలెంట్, ట్రెడిషన్ అనే ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని గత భాగస్వామ్య సదస్సులో తాను సూచించానని, ఆంధ్రప్రదేశ్ ఈ అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసి పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని చూరగొంటూ పెట్టుబడులను సాధిస్తోందని అన్నారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలు హాజరై రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ పాల్గొన్నారు. అలాగే సీఎం వెంట పలువురు ఎంపీలు, నేతలు హాజరయ్యారు.

# పర్యావరణహిత మైనింగ్‌పై దృష్టి పెట్టాలి: మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, రాజధాని వాయిస్:** రాష్ట్రంలో ఖనిజ వనరులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో నిర్వహించిన MERIT (Mineral Exploration, Research and Innovation Trust) రెండో గవర్నింగ్ బాడీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ వనరులను డిజిటల్ విధానంలో మ్యాపింగ్ చేసి, కొత్త ఖనిజ నిల్వలను గుర్తించాలని మంత్రి సూచించారు. మైనర్ మినరల్ లీజుదారుల సీనరేజీ రుసుములో 2 శాతం విరాళం, కేంద్ర NMET గ్రాంట్ల ద్వారా ఇప్పటివరకు MERITకు రూ.177.05 కోట్ల ఆదాయం సమకూరగా.. రూ.21 కోట్లు అన్వేషణ పనులకు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రూ.156.05 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. దేశంలో తొలిసారిగా అమలు చేస్తున్న 'ప్రీ-ఎంబెడెడ్ క్లియరెన్స్' విధానంతో గనుల వేలానికి ముందే పర్యావరణ, మైనింగ్ ప్లాన్ అనుమతులు పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. జయంతిపురం, దేవుడి, గుండ్లకుంట, అలగుమల్లిపాడు, నడికుడి, రామాపురం, పిల్లుట్ల పిడుగురాళ్ల తదితర 9 బ్లాకుల అనుమతుల ప్రక్రియ వేగవంతమైందని, వీటికి ఈ-వేలం 2027 జనవరి 1 నుంచి 22 మధ్య నిర్వహించనున్నట్లు తెలిపారు.కడప జిల్లా మంగంపేట బైరటీస్ గనుల్లో అదనపు నిల్వలను గుర్తించేందుకు 'క్వాంటమ్ గ్రావిమీటర్'తో ప్రయోగాత్మక సర్వేకు రూ.9.90 లక్షలతో అనుమతి ఇచ్చారు. రాష్ట్రవ్యాప్త మైనింగ్ మ్యాపింగ్‌లో 339 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.అనంతపురం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో క్రిటికల్ మినరల్స్ కోసం AI/ML మ్యాపింగ్ పూర్తయిందని, బండలమోటు పాత గనుల వ్యర్థాల్లో రాగి, వెండి, కోబాల్ట్, రేర్ ఎర్త్ మూలకాలపై అధ్యయనం పూర్తయిందని వెల్లడించారు. IIT ధన్‌బాద్, CSIR-NGRI హైదరాబాద్‌తో కీలక ఖనిజాల అన్వేషణకు ఒప్పందాలు కుదిరినట్లు తెలిపారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్ఠంగా వినియోగిస్తూ పర్యావరణహిత మైనింగ్‌ను అభివృద్ధి చేసి రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని, ఆంధ్రప్రదేశ్ మైనింగ్ రంగాన్ని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. సమావేశంలో మైనింగ్ డైరెక్టర్ డబ్ల్యూబీ చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేసేందుకు డిజిటల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ, రాజధాని వాయిస్:** ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, డిజిటల్, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య మరింత బలమైన డిజిటల్ వారధిగా ఈ యాప్ పనిచేస్తుందని పేర్కొన్నారు.మాన్యువల్ ప్రక్రియలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం ప్రజలతో మరింత అనుసంధానం కావడానికి ఈ యాప్ దోహదపడుతుందని మంత్రి తెలిపారు. యాప్ రూపకల్పన, వినియోగంలోకి తీసుకురావడనికి కృషి చేసిన శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్, ఐఏఎస్ ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా యాప్ రూపకల్పనలో భాగస్వాములైన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సాంకేతిక బృందాన్ని కూడా మంత్రి అభినందించారు. సరైన సమాచారాన్ని సరైన సమయంలో, సరైన డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రజలకు చేరవేసేలా సాంకేతికతను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్, ఐఏఎస్ మాట్లాడుతూ, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్‌డోర్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, కేడర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగల సమాచారాన్ని సమీకరించి ఈ డిజిటల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సమాచార ప్రసారం, మీడియా నిర్వహణ, పౌర సంబంధాలు, వాస్తవాల ధృవీకరణ, ప్రకటనలు, కేడర్ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు.మొబైల్ అప్లికేషన్ ద్వారా అధికారులు ఎక్కడి నుంచైనా శాఖకు సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు కూడా వార్తా విశేషాలు, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచార ప్రసార కార్యకలాపాలను ఈ యాప్ ద్వారా ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. దీని వలన క్షేత్రస్థాయి సమాచారం కూడా ప్రజలకు వేగంగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ టి. నాగరాజు, మీడియా రిలేషన్స్ విభాగం ఉప సంచాలకులు దున్న రమేష్, డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుస్మిత, ప్రత్యేక అధికారి గల్లా శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త ఉండాలి: గుంటూరు కలెక్టర్!



**గుంటూరు,రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** గుంటూరు: ఒక కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త ఉండాలని, ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఇ.పి.సి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు.ఉపాధికి అవకాశం ఉన్న అనేక పోజెక్టులు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ కౌశల్య యోజన క్రింద జిల్లాలో గ్రామీణ యువతను గుర్తించి నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వీరికి శిక్షణ ఇవ్వడమే కాకుండా ప్లేస్మెంట్ చూపించడం జరుగుతుందని అన్నారు. వృథాగా పోతున్న పువ్వులు నుండి అగరొత్తులు తయారు చేయుటకు కొంత మంది లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నామని కమిటీ సభ్యులు పావని చేసిన సూచన మేరకు తెలిపా రు.ఎం.ఎస్.ఎం.ఇ క్లెయిమ్ ల క్రింద 20 మందికి రూ.2.24 కోట్లకు కమిటీ ఆమోదించింది. సింగిల్ డెస్క్ పాలసీ క్రింద 24 దరఖాస్తులను ఆమోదించింది. మంగళగిరి ఆటో నగర్, గోరంట్ల ఇండస్ట్రియల్ పార్క్ లలో నడుస్తున్న మూడు సంస్థలు తమ కార్యకలాపాలను మార్పు చేయుటకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఉప సంచాలకులు ప్రదీప్ కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.నరసింహారావు, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం, పర్యాటక అధికారి ఏ.రమ్య, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు వందనం, ఎల్.డి.ఎం మహిపాల్ రెడ్డి, నాబార్డు డి.డి.ఎం శరత్, ఆర్.టి.ఓ పద్మావతి పాల్గొన్నారు.

## మా-ఏపి' సినిమా డైరీ విడుదల చేసిన కలెక్టర్ సాయికాంత్ వర్మ!



**గుంటూరు, రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ ( మా-ఏపి) సినిమా డైరీ ను గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ గురువా రం కలెక్టర్ కార్యాలయంలో విదుదల చేశారు. టాలీవుడ్ దర్శకుడు, మా ఏపి' వ్యవస్థాపకులు దిలీప్ రాజా అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మా' ఏపిలో సభ్యత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ సినీ నటినటులు పాల్గొన్నారు.గుంటూరు జిల్లా తెనాలిలో మా ఏపీ ప్రధాన కార్యాలయం 2018 నుండి 587 సభ్యులతో పని చేస్తున్న నేపథ్యంలో అదే జిల్లా కలెక్టర్ ద్వారా మా ఏపి సినిమా డైరీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు దిలీప్ రాజా చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ లోని ఔత్సాహిక కళాకారుల డైరీను సినీ పరిశ్రమలో కొందరు ప్రముఖులకు అందజేస్తామని ఆయన తెలిపారు. తద్వారా ఆంధ్రకు చెందిన నిర్మాత దర్శకుల ముంగిట్లోకి మా' ఏపి డైరీ చేరుతుందన్నారు.డైరీ లోని నటీనటులకు ఉజ్వల భవిష్యత్తు రావాల ని ఆశిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారని దిలీప్ రాజా వివరించారు. కార్యక్రమంలో విజయనగరం రామకృష్ణ, భవానీ కపూర్, సముద్రాల, రమేష్ వర్మ, వారణాసి పాత్రుడు, వీరశీకి లక్ష్మి, వంశీ, తుమ్మా పాపారావు, స్వామి, సైదులు యాదవ్, యర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం!



**గుంటూరు, రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. స్థానిక ఎన్నికల ముందస్తు ఏర్పాట్లు, సంసిద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్ లు, ఇతర సామాగ్రి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవి న్యూ అధికారి ఎస్.ఎస్.కె. ఖాజావలి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు, పొన్నూరు కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు పోష్ చట్టంపై విస్తృత అవగాహన అవసరం: కలెక్టర్!



**గుంటూరు, రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** పోష్ చట్టం పై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.పోష్ చట్టంపై అవగాహనకు ఫౌండేషన్ చేస్తున్న కృషిని ప్రశంసి ంచారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నేషనల్ సెక్రెటరీ శ్రీనీలత, ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ భాస్కర్, ఏపీ స్టేట్ ట్రెజరీ చందు వీర కుమార్ పాల్గొన్నారు.

# తొలగించిన ఓటర్లపై ఇంటింటి సర్వే అధికారులకు కలెక్టర్ ఆదేశాలు!



**గుంటూరు,రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :** అర్హులైన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో నమోదు చేయుటకు మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించాలని తెలిపారు. ఈ డ్రైవ్ లో భాగంగా, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి, తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించి తొలగించిన పేర్ల జాబితాలను తీసుకువెళ్లి ఆయా ఓటర్ల స్థితిని పునః ధ్రువీకరించాలని ఆదేశించారు. ఎవరి పేరైనా పొరపాటున తొలగించినట్లు గుర్తిస్తే, ఆ ఓటరుతో ఫారం- 6 పూరించడానికి అవకాశం కల్పించాలని ఆదేశించారు.తగిన ధృవీకరణ పూర్తయిన తర్వాత, నిరంతర నవీకరణ ప్రక్రియ కింద వారి పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం, శుక్రవారం, శనివారం మూడు రోజులపాటు ఈ ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని మరియు జాబితాలో ఏ ఒక్క అనర్హుడూ ఉండకూడదని" భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. తొలగించిన ఓటర్ల వివరాలు సర్వే,కొత్తగా చేరవలసిన ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎన్నికల సంఘం సంఘం నిర్ణయించిందని వివరించారు. "అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటర్ల జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం" అనే ఈసీఐ లక్ష్యానికి అనుగుణంగా ప్రస్తుత డ్రైవ్ ఉద్దేశించడం జరిగిందని చెప్పారు.2026 ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా, 2026 జూన్ 15 నుండి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. మరణం, శాశ్వత నివాస మార్పు, బహుళ నమోదులు, చిరునామాలో లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల ఓటర్లు వారు ఇచ్చిన చిరునామాలలో లేరని ఈ సర్వేలో బూత్ స్థాయి అధికారులు గుర్తించిన విషయం విదితమేనని అన్నారు. ఇంటింటి సర్వే ఆధారంగా మరణించిన, స్థలం మారిన, బహుళ నమోదులు కలిగిన ఓటర్ల పేర్లను తొలగించిన తర్వాత, 2026 జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరిగిందని తెలిపారు.ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత నోటీసు దశలో, 2026 అక్టోబర్ 6 నాటికి ప్రచురించబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చడానికి వీల్లేని ఓటర్లను అనర్హులుగా గుర్తిండం జరిగిందన్నారు. రాష్ట్రంలో 2026 ప్రత్యేక సమగ్ర సవరణ కింద 2026 అక్టోబరు 16వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల నమోదుకు జనవరి 1, ఏప్రిల్ 1, జులై, అక్టోబర్ అనే నాలుగు అర్హత తేదీలు అందుబాటులో ఉన్నాయన్నారు.రాబోయే సంవత్సరం జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి వార్షిక సంక్షిప్త సవరణను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 2026 అక్టోబరు 16వ తేదీన ప్రచురించే తుది జాబితాలో పేరు లేని వారు, పొరపాటున వదిలివేయబడినవారు లేదా తదుపరి అర్హత తేదీల నాటికి అర్హత పొందే ఏ వ్యక్తి అయినా సరే నిరంతర నవీకరణ ప్రక్రియలో భాగంగా తమ పేరు నమోదు కోసం ఫారం-6 ను సమర్పించవచ్చని వివరించారు.

# గుంటూరులో ఓటర్ల ఇంటింటి సర్వే ప్రారంభం!




**గుంటూరు, రాజధాని వాయిస్ :** అర్హులైన ప్రతి ఓటరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు నగర కమిషనర్, తూర్పు నియోజ కవర్గ ఈఆర్ఓ మయూర్ అశోక్ గుంటూరు నగరంలో తొలగించి న ఓటర్ల వివరాలను ఇంటింటి సర్వే ద్వారా మరోసారి పరిశీలిం చాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ మయూర్ అశోక్ ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల్ మేరకు ఓటర్ల ఇంటింటి సర్వేపై గురువారం నగరపాలక సంస్థ అదనపు ఓటర్ నమోదు అధికారులు, సూపర్వైజర్లు, బిఎల్ఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో నమోదు చేయుటకు మూడు రోజులపాటు (ఈ నెల 8 నుండి 10వరకు) ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించాలని తెలిపారు. ఈ డ్రైవ్ లో భాగంగా, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి, తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు సంబంధించి తొలగించిన పేర్ల జాబితాలను తీసుకువెళ్లి ఆయా ఓటర్ల స్థితిని పునః ధ్రువీకరించాలని ఆదేశించారు. ఎవరి పేరైనా పొరపాటున తొలగించినట్లు గుర్తిస్తే, ఆ ఓటరుతో ఫారం- 6 పూరించడానికి అవకాశం కల్పించాలని ఆదేశించారు. తగిన ధృవీకరణ పూర్తయిన తర్వాత, నిరంతర నవీకరణ ప్రక్రియ కింద వారి పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని స్పష్టం చేశారు. గురువారం, శుక్రవారం, శనివారం మూడు రోజులపాటు ఈ ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని మరియు జాబితాలో ఏ ఒక్క అనర్హుడూ ఉండకూడదని" భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. తొలగించిన ఓటర్ల వివరాలు సర్వే, కొత్తగా చేరవలసిన ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎన్నికల సంఘం సంఘం నిర్ణయించిందని వివరించారు. "అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటర్ల జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం" అనే ఈసీఐ లక్ష్యానికి అనుగుణ ంగా ప్రస్తుత డ్రైవ్ ఉద్దేశించడం జరిగిందని చెప్పారు. 2026 ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా, 2026 జూన్ 15 నుండి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. మరణం, శాశ్వత నివాస మార్పు, బహుళ నమోదులు, చిరునామాలో లేకపోవడం, ఇతర కారణాల వల్ల ఓటర్లు వారు ఇచ్చిన చిరునామాలలో లేరని ఈ సర్వేలో బూత్ స్థాయి అధికారులు గుర్తించిన విషయం విదితమేనని అన్నారు. ఇంటింటి సర్వే ఆధారంగా మరణించిన, స్థలం మారిన, బహుళ నమోదులు కలిగిన ఓటర్ల పేర్లను తొలగించిన తర్వాత, 2026 జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత నోటీసు దశలో, 2026 అక్టోబర్ 16 నాటికి ప్రచురించబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చడానికి వీల్లేని ఓటర్లను అనర్హులుగా గుర్తిండం జరిగిందన్నారు.రాష్ట్రంలో 2026 ప్రత్యేక సమగ్ర సవరణ కింద 2026 అక్టోబరు 16వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల నమోదుకు జనవరి 1, ఏప్రిల్ 1, జులై, అక్టోబర్ అనే నాలుగు అర్హత తేదీలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాబోయే సంవత్సరం జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి వార్షిక సంక్షిప్త సవరణను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 2026 అక్టోబరు 16వ తేదీన ప్రచురించే తుది జాబితాలో పేరు లేని వారు, పొరపాటున వదిలివేయబడినవారు లేదా తదుపరి అర్హత తేదీల నాటికి అర్హత పొందే ఏ వ్యక్తి అయినా సరే నిరంతర నవీకరణ ప్రక్రియలో భాగంగా తమ పేరు నమోదు కోసం ఫారం-6 ను అందుబాటులోని బిఎల్ఓకి సమర్పించవచ్చని తెలిపారు. బిఎల్ఓ లు కూడా తమ పరిధిలోని ఓటర్లకు సర్వేపై అవగాహన కల్గించాలని, సూపర్వైజర్లు, అడిషనల్ ఏఈఆర్ఓలు కూడా క్షేత్ర స్థాయి సర్వేలో నేరుగా పాల్గొనాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా జరుగుతున్న సర్వేలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఈఆర్ఓలకు స్పష్టం చేశారు.

## బద్వేల్‌లో ఘనంగా అనీమియా స్క్రీనింగ్ క్యాంప్!



**బద్వేలు, రాజధాని వాయిస్ :** ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు రక్తహీనత, ఐరన్ లోపాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు రావాలని బద్వేలు ఆర్డీఓ.ఎ. చంద్ర మోహన్ సూచించారు. గోపవరం మండలం పీ.పీ. కుంట గ్రామం లోని పీ.పీ. కుంట హైస్కూల్‌లో గురువారం అనీమియా ముక్త్ భారత్ -- అనీమియా స్క్రీనింగ్ క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. Century Panels Ltd వారి సహకారంతో, సమాజ ఆరోగ్య పరిరక్షణ మరియు ఐరన్ లోపం నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమా న్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా బద్వేలు డివిజన్ ఆర్డీఓ ఎ. చంద్ర మోహన్, గౌరవ అతిథిగా బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎం. సూర్యనారాయణ రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎ. చంద్ర మోహన్ మాట్లాడుతూ, రక్తహీనత ముఖ్యంగా మహిళలు, బాలికలు మరియు పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స మరియు పోషకాహారం అందించడం ద్వారా అనీమి యాను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బద్వేల్ నియోజ కవర్గ టిడిపి ఇన్చార్జ్. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు మరియు ప్రజలు సమన్వ యంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతా ల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.క్యాంప్‌లో భాగంగా హిమోగ్లోబిన్ స్క్రీనింగ్ నిర్వహించి, రక్తహీనతను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు చేపట్టారు. ఐరన్ లోపం నివారణకు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య పరిరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారు లు, వైద్య సిబ్బంది, Century Panels ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఘనంగా సేవా సంకల్ప అభియాన్ వైద్య శిబిరం



**చింతకుంట,రాజధాని వాయిస్ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనే లక్ష్యంతో చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వికసిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక, పరిసర గ్రామాల ప్రజలకు వివిధ వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిం చడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించారు. రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులను ముందుగానే గుర్తించేలా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.అలాగే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, అనీమియా, ప్రీ-డయాబెటిస్, ఆప్తాల్మిక్ పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్, గైనకాలజీ సేవలు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ గుర్తింపు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు, తదుపరి చికిత్స అవసరమైన వారిని ఉన్నత వైద్య కేంద్రాల కు రిఫర్ చేసేలా చర్యలు చేపట్టారు. ఇమ్యునైజేషన్ సేవలు, ఐఈసీ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ఆరోగ్య సేవలు, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడు తూ.. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్న వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్, ఆరోగ్య పర్యవేక్షకులు శివ గంగరాజు, మల్లేశ్వరి, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్త లు పాల్గొన్నారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## ప్రొద్దుటూరులో అల్యూమినియం, ఐరన్, గ్లాస్, స్టీల్ కార్మికుల నిరసన!

**ప్రొద్దుటూరు, రాజధాని వాయిస్ అక్టోబర్ 8 :**స్థానిక అల్యూమినియం, ఐరన్, గ్లాస్, స్టీల్ కార్మికుల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ 'ప్రొద్దుటూరు అల్యూమినియం ఐరన్ గ్లాస్ స్టీల్ కార్మికుల అసోసియేషన్' ఆధ్వర్యంలో గురువారం మైదుకూరు రోడ్డులోని రాజస్థాన్ దుకాణాల ఎదుట నిరసన తెలిపారు. "గో బ్యాక్ రాజస్థాన్ ఓనర్స్" అంటూ నినాదాలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు వారి రాష్ట్రాలకు సంబంధించిన కార్మికులతోనే పనులు చేయిస్తుండటం వల్ల స్థానిక కార్మికులు పనులు లేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.రాజస్థాన్ దుకాణ యజమానులు ఇంటీరియర్ పరికరాల అమ్మకాల్లో నాణ్యత తగ్గించి వినియోగదారులను మోసం చేస్తున్నారని, సమస్యలు వస్తే బాధ్యత వహించడం లేదని ఆరోపించారు. స్థానిక వ్యాపారులు, వినియోగదారులు ఇతర రాష్ట్రాల వారిని కాకుండా స్థానిక కార్మికులకే పనులు అప్పగించాలని కోరారు..

# దసరా దేవి శరన్నవరాత్రులు పుస్తకాలను ఆవిష్కరించిన కారంపూడి ఆర్యవైశ్యులు

**కారంపూడి. అక్టోబర్ 08 రాజదాని వాయిస్ :** పట్టణంలోని గురువారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా దేవి శరన్నవరాత్రులు మహోత్సవంములు సందర్భంగా దసరా దేవి శరన్నవరాత్రులు పుస్తకాలను ఆర్యవైశ్యులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రుల ఉత్సవములలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని భక్తులను కమిటీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు మద్దు హనుమంతరావు ఆర్యవైశ్య సంఘం నాయకులు చీతిరాల కోటేశ్వరరావు, యక్కల శ్రీనివాసరావు, ఎస్ పీ ఆర్ కృష్ణ, కొలిశెట్టి మల్లికార్జునరావు, మిత్తింటి సాంబశివరావు, కొత్త నరసింహారావు, కొల్లా సాంబయ్య, మద్దు శ్రీనివాసరావు, సురే కోటేశ్వరరావు, కంభంపాటి సత్యనారాయణ,



గుండా వెంకటేశ్వర్లు, కరాలపాటి సుబ్బారావు, ఊటుకూరి రాము, ఆతుకూరి గోపి,కలవల శ్రీను, సముద్రాల పవన్ సాయి, చీతిరాల రామాంజనేయులు, మల్లికార్జున రావు, నాగేశ్వరరావు, సాంబశివరావు పాలకమండలి సభ్యులు మరియు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలకు ప్లేట్లు,గ్లాసులు పంపిణీ

**కారంపూడి అక్టోబర్ 08 రాజదాని వాయిస్ :** మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కర్నూలు జిల్లా కు చెందిన బి శ్రీనివాస రావు మధ్యాహ్న భోజనముకు 100 ప్లేట్లు మరియు 100 గ్లాసులు పంపిణీ చేశారు. ఈ వితరణ చేసిన బి శ్రీనివాసరావుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆన్లైన్ ద్వారా ప్రశంస పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పట్ల ప్రేమ కలిగిన బి శ్రీనివాసరావుకు విద్యాశాఖ తరఫున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు అనిల్ కుమార్ మరియు రవికుమార్ మాట్లాడుతూ, శ్రీనివాసరావు సహాయానికి మండల విద్యాశాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు డోనార్ యాప్ ద్వారా చేయూతనిచ్చి విద్యాభివృద్ధికి సహాయ పడాలని వారు కోరారు. ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆలేటి బిక్షమయ్య మాట్లాడుతూ, పాఠశాలకు సహాయం అందించిన ప్రతి దాత పేరును డోనార్ యాప్ లో నమోదు



చేయడం జరుగుతుందని విద్యాశాఖ మంత్రి ద్వారా ప్రశంసాలు అందుకొని వారి యొక్క సేవలకు మరింత ఎక్కువగా పాఠశాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మరియు పాఠశాల సిబ్బంది షేక్ సహిదాలి ,షేక్ రబ్బాని ,షేక్ సత్తార్, అబ్దుల్ సుభాన్, బేగం ముని రా బేగం, అంజలి పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్‌లో ఒకే కుటుంబం అద్భుత ప్రతిభ

## మూడు బంగారు పతకాలు, రెండు టైటిళ్లు కైవసం

**గురజాల. అక్టోబర్ 08 రాజధాని వాయిస్ :**ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని నాగబండి రామారావు మెమోరియల్ కన్వెన్షన్ హాల్లో అక్టోబర్ 3, 4 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్‌లో పల్నాడు జిల్లా గురజాలకు చెందిన ఒకే కుటుంబం అరుదైన ఘనత సాధించింది. తండ్రి కత్తి జ్యోతిబాబు స్వయంగా శిక్షణ ఇస్తూ తన పిల్లలను క్రీడారంగంలో ప్రోత్సహించగా, పోటీల్లో తండ్రితో పాటు కుమారుడు, కుమార్తె కూడా విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. పోటీలలో జ్యోతిబాబు స్వర్ణ పతకం సాధించగా, ఆయన కుమారుడు కత్తి కార్తిక్ గోల్డ్ మెడల్‌తో పాటు ఏపీ సబ్‌జూనియర్ విభాగంలో 'స్ట్రాంగ్ బాయ్' టైటిల్ గెలుచుకున్నాడు. అలాగే కుమార్తె కత్తి పల్లవి కూడా బంగారు పతకాన్ని సాధించడంతో పాటు సబ్‌జూనియర్ విభాగంలో 'ఏపీ స్ట్రాంగ్ గర్ల్' టైటిల్‌ను కైవసం చేసుకుని సత్తా చాటింది. క్రమశిక్షణ, నిరంతర




సాధనతో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు స్వర్ణాలు, రెండు ప్రతిష్ఠాత్మక టైటిళ్లు సాధించడంపై స్థానికులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

# ముందస్తు గుర్తింపుతోనే క్యాన్సర్‌కు చెక్

## - ఉచిత స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన



**మాచర్ల. అక్టోబర్ 08 రాజధాని వాయిస్ :** క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే ప్రాణాలను సులభంగా కాపాడవచ్చని శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, శరీరంలో అసాధారణ గడ్డలు, మార్పులు, కారణం లేని బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, పొగాకు, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. శిబిరంలో మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలతో పాటు ఇతరులకు ప్రాథమిక స్క్రీనింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిమ్స్ చక్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పి. యశ్వంత్, డాక్టర్ ప్రతాప్ కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ చెన్నకేశవ ప్రతినిధులు, నిర్వాహకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిరక్షరాస్యులకు అక్షరాంధ్ర ఉల్లాస్ పుస్తకాల పంపిణీ

## - ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

**కారంపూడి. అక్టోబర్ 08 రాజధాని వాయిస్ :**స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిరక్షరాస్యుల కోసం 4,250 అక్షరాంధ్ర ఉల్లాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రతిరోజూ సాయంత్రం 5 నుండి రాత్రి 9 గంటల వరకు గ్రామాల్లోని నిరక్షరాస్యులకు వాలంటీర్ల ద్వారా చదువు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు యానిమేటర్ల పర్యవేక్షణలో ఈ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరెడ్డి, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, ఎఫ్ఏఎస్ తదితరులు పాల్గొన్నారు.




## మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ

**నరసరావుపేట, అక్టోబర్ 08రాజధాని వాయిస్ :**పల్నాడు జిల్లాలో మద్యం షాపుల లైసెన్సు లు కేటాయింపునకు గురువారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్లా, సమక్షంలో దరఖాస్తుదారుల సమక్షంలో ఈ లాటరీని పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.జిల్లాలో ఓపెన్ కేటగిరీలో మొత్తం 24 మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ చేయగా, తొలిదశలో 12 షాపులకు సంబంధించి 49 దరఖాస్తులు అందాయి. వీటికి కలెక్టర్ సమక్షంలో లాటరీ నిర్వహించి అభ్యర్థులకు షాపులను కేటాయించారు.లాటరీ ద్వారా కేటాయించిన షాపుల్లో చిలకలూరిపేటకు 3, సత్తెనపల్లికి 6, మాచర్లకు 1, వినుకొండకు 1, ఇపూరుకు 1 చొప్పున మొత్తం 12 షాపులు ఉన్నాయి. ఇక మిగిలిన 12 మద్యం షాపులకు సంబంధించి నోటిఫికేషన్‌ను అక్టోబర్ 10, శనివారం విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే. మణికంఠ, జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే. రవీంద్ర, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సిబ్బంది, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా సౌర కాంతులు విరజిమ్మాలి ఎమ్మెల్యే జూలకంటి

## పీఎం సూర్య ఘర్ తో పర్యావరణ పరిరక్షణ
## కరెంట్ బిల్లుల ఆదా
## ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీతో సోలార్ ప్యానెళ్లు

**మాచర్ల అక్టోబర్ 08 రాజధాని వాయిస్ :** ప్రతి ఒక్కరూ సౌర శక్తి వినియోగంపై దృష్టి సారించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వడ్డె ఓబన్న విగ్రహం వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ సేవా సేతు అభియాన్ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గృహాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా కరెంట్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం విద్యుత్ రంగంపై భారాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు.అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో సోలార్ ప్యానెళ్లు అందిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రీన్ ఇండియా అవగాహన ప్రచార బోర్డు వద్ద ఎమ్మెల్యే ఫొటో దిగారు.




ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ నాగ సురేంద్ర కుమార్, ఏఈలు కోటేశ్వరరావు, శ్రీశైలం, జెస్సి జైకర్, సీతారాములు, కూటమి నాయకులు కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, అనంతరాములు, వజ్రం నాయక్, కంభంపాటి అనిల్, మున్నా రాంబాబు, పోలా సత్యం, లాల్ కిషన్, కల్యాణి సోలార్ సీఈవో లీలా ప్రసాద్, చంటి, గణేష్‌పాల్గొన్నారు.

# ఆరియా క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత స్క్రీనింగ్ శిబిరం!





**గుంటూరు,రాజధాని వాయిస్ :** లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్కు చెందిన ఆరియా క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని లలిత పీవీఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో నెలవారీ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి ఉచిత నివారణ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా రెండవ గురువారం ఈ శిబిరం జరుగుతుంది. ఆసుపత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డా. పి.వి. రాఘవశర్మ, మేనేజిం గ్ డైరెక్టర్ డా. పి. విజయ గార్ల ఆశయ సాధనలో భాగం గా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.ఆరియా క్యాన్సర్ సెంటర్ హెడ్, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. బైరపనేని స్రవంతి దీనికి నేతృత్వం వహిస్తున్నారు. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా పాటిస్తున్న నేపథ్యంలో, ఈ నెల శిబిరంలో రొమ్ము ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.ప్రస్తుతం భారతదేశంలో మహిళల్లో అత్యధికంగా కనిపిస్తున్న క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్. ఐసీఎంఆర్ జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ కార్యక్రమం అంచనాల ప్రకారం 2024లో దేశంలో సుమారు 2.27 లక్షల కొత్త కేసులు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబోకాన్ గణాంకాల ప్రకారం 2022లో దాదాపు 98,000 మరణాలు నమోదయ్యాయి. రొమ్ము క్యాన్సర్ మరణాల్లో భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. కేసులు ఏటా 5 శాతానికి పైగా పెరుగుతున్నాయని ఇటీవలి ఐసీఎంఆర్ అధ్యయనం వెల్లడిం చింది.యువతుల్లో కూడా ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. పాశ్చాత్య దేశాల మహిళలతో పోలిస్తే భారతీయ మహిళల్లో రొమ్ము క్యాన్సర్ దాదాపు పదేళ్లు ముందుగానే వస్తోంది. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో 15 నుంచి 25 శాతం మంది 40 ఏళ్ల లోపు వారేనని దేశంలోని పలు ఆసుపత్రుల అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వయసు వారిలో వ్యాధి మరింత తీవ్రంగా ఉంటుందని కూడా అవి తెలిపాయి. అయినప్పటికీ 30 నుంచి 69 ఏళ్ల వయసున్న మహిళల్లో కేవలం 1.6 శాతం మంది మాత్రమే ఇప్పటివరకు స్క్రీనింగ్ చేయించుకున్నారు. 60 శాతానికి పైగా బాధితుల్లో వ్యాధి ముదిరిన దశలోనే బయటపడుతోంది.ఈ సందర్భంగా డా. బైరపనేని స్రవంతి మాట్లాడుతూ, ఏదైనా బయటపడుతుందేమోనన్న భయంతో చాలా మంది మహిళలు పరీక్షలు చేయించుకోవడానికి వెనుకాడుతున్నారని అన్నారు. "లేని క్యాన్సర్ను ఏ స్కాన్ కూడా గుర్తించదు. చాలా మంది మహిళలకు స్క్రీనింగ్ ఒక భరోసాను ఇస్తుంది. ఒకవేళ క్యాన్సర్ ఉన్నట్లయితే, దానిని ముందుగా గుర్తించడం ఎంతో మార్పు తెస్తుంది. చికిత్స సులభమవుతుంది, కోలుకోవడం మెరుగ్గా ఉంటుంది, కుటుంబంపై ఆర్థిక భారం కూడా చాలా తగ్గుతుంది. రొమ్ము క్యాన్సర్ను ముందుగా గుర్తించిన మహిళల్లో చాలామంది సంపూర్ణ, ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్నారు. తొలి దశలో గుర్తించిన రొమ్ము క్యాన్సర్ పూర్తిగా నయమయ్యే అవకాశాలు చాలా ఎక్కువ" అని ఆమె పేర్కొన్నారు.

**మహిళలు ఈ క్రింది స్క్రీనింగ్ సూచనలు పాటించాలని వైద్యులు సూచించారు:**

1. 30 ఏళ్ల వయసు నుంచి ప్రతి నెలా స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకోవాలి. ఈ క్రింది మార్పుల్లో ఏది గమనించినా ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి: రొమ్ములో గడ్డ, చర్మం ముడతలు పడటం లేదా లోపలికి లాగినట్లు ఉండటం, రొమ్ము ఆకృతిలో మార్పు, చనుమొన నుంచి స్రావం, చంకలో గడ్డ.
2. 40 ఏళ్ల వయసు నుంచి ఏడాదికి లేదా రెండేళ్లకు ఒకసారి మామోగ్రామ్ చేయించుకోవాలి. ఎంత వ్యవధిలో చేయించుకోవాలో వ్యక్తిగత రిస్కు బట్టి వైద్యులు నిర్ణయిస్తారు.
3. కుటుంబంలో రొమ్ము లేదా అండాశయ క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, ఇతర రిస్క్ కారకాలు ఉన్నవారు ముందుగానే స్క్రీనింగ్ ప్రారంభించాల్సి రావచ్చు. వీరు ఆంకాలజిస్ట్ను సంప్రదించాలి.

శిబిరానికి సుమారు 150 మందికి పైగా హాజరైన మహిళలను ఆరియా ఆంకాలజీ బృందం పరీక్షించింది. ఈ బృందంలో సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. శ్రీనివాస్ అయ్యప్ప, మెడికల్ ఆంకాలజిస్ట్ డా. కావ్య పామిడి ఉన్నారు. గైనకాలజిస్ట్ డా. ప్రత్యూష లావు గైనకాలజికల్ స్క్రీనింగ్ నిర్వహించారు. రేడియాలజిస్ట్ డా. హనుమాన్ ఇమేజింగ్ పరీక్షలు చేశారు.శిబిరంలో రక్త పరీక్షలు, మామోగ్రఫీ, పాప్ స్మియర్, పెల్విక్ అల్ట్రాసౌండ్, ఆంకాలజిస్ట్ కన్సల్టేషన్ ఉచితంగా అందించారు.తదుపరి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నవంబర్ 12, 2026 గురువారం నాడు జరుగుతుంది. గుంటూరులోని లలిత పీవీఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, 3వ అంతస్తులోని ఆంకాలజీ ఓపీడీలో శిబిరం ఉంటుంది. వివరాలకు సంప్రదించండి: 7901644605.

# చీరాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం!

**చీరాల, రాజధాని వాయిస్ :** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. రోటరీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ రొటేరియన్ ఉదయ్ సుధీర్ పీలానీ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలేజీ ప్రాంగణ ంలో మామిడి, సపోటా, జామ, ఉసిరి తదితర రకాల 20 మొక్కల ను నాటారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, విద్యార్థి దశ నుంచే పచ్చదనం ప్రాధాన్యతను యువతకు తెలియజే యాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు.

**టాయిలెట్ల ఏర్పాటుకు విజ్ఞప్తి**

సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలో విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన టాయిలెట్ల సౌకర్యం లేదని కాలేజీ ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజ్ తెలిపారు. కాలేజీలో టాయిలెట్లను ఏర్పాటు చేసేందుకు రోటరీ క్లబ్ సహకరించాలని కోరుతూ డిస్ట్రిక్ట్ గవర్నర్ రొటేరియన్ ఉదయ్ సుధీర్ పీలానీ, అసిస్టెంట్ గవర్నర్




డాక్టర్ ఐ. బాబూరావులకు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను పరిశీలించి తగిన సహాయం అందించాలని కోరారు.

**గవర్నర్‌కు ఘన సన్మానం**

చీరాల రోటరీ క్లబ్‌కు అధికారిక పర్యటనలో భాగంగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉదయ్ సుధీర్ పీలానీని రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన పరిశీలించి సభ్యులను అభినందించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com